# మహర్షి

'అల్లా. రబ్బుల్ ఆల మీన్. అయ్ పర్వర్దిగార్. అబ్బా జాన్‌ను కరుణించు. ఆయన్ని త్వరగా నీ దగ్గరికి తీసుకుపో'.

నా మనసు ఆక్రోశిస్తూనే ఉంది. అల్లాను ప్రార్థిస్తూనే ఉంది. అయినా, అల్లాకు ఇంకా దయ కలగలేదు.

మా నాన్నగారు మృగరాజు లాంటి వారు. పోలీస్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం చేసినంతకాలం సింహంలాగే హుందాగా జీవించారు. రిటైరయ్యాక కూడా ఆయన తత్వంలో ఏమాత్రం మార్పు లేదు.

ఆయన్ని చూస్తే ఎంతవారైనా భయపడ్తారు. గౌరవిస్తారు.

కానీ, ఆయన ఎప్పుడూ మృదుభాషి. ఉద్యోగ ధర్మ నిర్వహణలో కూడ కఠినంగా వ్యవహరించేవారేకానీ, శత్రువుతో సైతం కటువుగా మాట్లాడి ఎరుగరు.

''నాయనా, ఇక్బాల్. భారతీయ ఋషులు ఏం చెప్పేరోతెల్సా? వాక్కు తపస్సు అన్నారు. మనసు, వాక్కు, కర్మ - మూడూ పవిత్రంగా ఉండాలి. 'మనోవాక్కాయ కర్మణ్యా' అని దానినే అన్నారు ఋషులు.''

మా నాన్నగారి పేరు అబ్దుల్ హమీద్. ఆయన పెద్దగా ఇస్లామ్ ధర్మశాస్త్రాలని చదివినవారు కాదు. హిందూ శాస్త్రాలనూ చదవలేదు. కానీ, రెండింటి తత్వాన్ని ఆయనకు జనార్ధనశాస్త్రిగారు నూరిపోసేరు.

జనార్ధనశాస్త్రిగారు నాన్నగారి సహాధ్యాయి. బాల్య మిత్రుడు. మహా మేధావి. ఆయన వాగ్ధార గంగాప్రవాహం. మనసు మంధర పర్వతం. అలాంటి జనార్ధనశాస్త్రిగారు రెవెన్యూ డిపార్టుమెంట్‌లో పడి నలిగిపోయారు. ఉద్యోగంలో ఉండగానే చనిపోయారు.

ఆవార్త తెలిసినప్పుడు నాన్నగారు కన్నీరు కార్చారు. చిన్నపిల్లవాడిలా దుఃఖించారు. నాన్నగారి కళ్ళ వెంట కన్నీటిని చూసింది అదొక్కసారే.

జనార్ధనశాస్త్రిగారి ప్రభావం నాన్నగారి మీద చాలా ఉంది.

చేసింది పోలీస్ ఉద్యోగమైనా, నిజాయితీగా జీవించారు. రోజుకు అయిదు మార్లు నమాజు చేసేవారు.

''భగవంతుడిపై విశ్వాసం మనిషిలో ఆత్మస్థయిర్యాన్ని పెంచుతుంది, బేటా ఇక్బాల్. స్వధర్మ నిర్వహణలో బలాన్నిస్తుంది.''

అలాంటి మా నాన్నగారు ఇటీవల అస్వస్థులయ్యారు. డాక్టర్ల దగ్గరికి తీసుకుపోతానంటే వద్దన్నారు.

ఆయనకు హోమియోలో ప్రవేశం ఉంది. అలోపతి వైద్యం అంటే ఎందుకో ఆయనకు మొదటి నుంచీ విముఖత.

కానీ, ఎప్పుడూ పనిచేసే ఆయన హోమియో మందులు, ఈసారి ఆయనపై పని చేయలేదు.

నాలుగు రోజుల క్రితం ఆయన పరిస్థితి విషమించింది. అపస్మారక స్థితిలో ఉండగా ఆయన్ని కారులో ఓ పెద్ద స్టార్ హాస్పిటల్‌కి తీసుకెళ్ళేము. డాక్టర్లు రకరకాల పరీక్షలు చేసేరు. సెలైన్‌లు ఎక్కించారు. ఏవో మందులు ఇచ్చారు.

ఆయన కళ్ళు తెరిచి మమ్మల్ని గుర్తుపట్టేరు. జరిగినదంతా తెలుసుకొన్నారు. కేస్ షీట్ చూచారు. అప్పటివరకు జరిగిన వైద్యం గురించి తెలుసు కొన్నారు.

''డాక్టర్‌గారూ, నాజబ్బేమిటి? వైద్యం చేసి మీరు నన్నెంత కాలం బతికించగలరు? వైద్యం లేకపోతే నేనెంతకాలం బతకగలను?''

నాన్నగారి ప్రశ్నలకు డాక్టర్ షాక్ తిన్నాడు. అలవాటయిన ఏవో మాటలని డొంకతిరుగుడుగా చెప్పబోయాడు.

''ప్లీజ్, డాక్టర్. నా ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పండి. నాకు మీ నుంచి ధైర్యవచనాలు, ఆశావచనాలు అక్కరలేదు. నేను మృత్యువుకు భయపడటంలేదు. కృత్రిమంగా నా జీవితాన్ని పదిహేను రోజులో, కొన్ని నెలలో పొడిగించుకోవాలన్న కోరిక కూడా లేదు. కమ్ టు బిజినెస్, ప్లీజ్.''

డాక్టరుకు కోపం వచ్చి వెళ్ళిపోయాడు.

''బిల్లు కట్టేయండి. ఇంటికి వెళ్ళిపోదాం.''

అందరం కలిసి నచ్చచెప్పబోయాం. ఎందుకంటే, భగవంతుడి దయవలన నేను మంచి ఉద్యోగం చేస్తున్నాను. నా తండ్రికి ఖరీదైన వైద్యం చేయించగల సత్తా నాకుంది.''

''నెల రోజులు హాస్పిటల్‌లో మందులతో జీవించి శవమై ఇల్లు చేరుకోటం నాకు ఇష్టం లేదు నాయనా. నా ఇంట్లో అపస్మారక స్థితిలోనే ఉండి మరణించటం నాకు ఇష్టం. మనిషి చావకుండా కొంత కాలం నిరోధించగల శక్తి మోడ్రన్ మెడిసన్‌కు ఉంది. ఆ శక్తినే బిగ్ బిజినెస్‌గా మార్చుకొంటున్నారు డాక్టర్లు. అంతేకానీ, చావును జయించే శక్తి ఏ మెడిసిన్‌కీ లేదు. అంతగా తండ్రి ఋణాన్ని తీర్చుకోలేకపోయానన్న కొరత నీకుంటే - వైద్య సహాయం అందుబాటులో లేని వికసించని పుష్పాలకు సాయం చెయ్యి. వాడిపోయిన పుష్పాన్ని నేను. రాలిపోక తప్పదు.''

ఇంటికి తీసుకొచ్చిన కొద్దిసేపటికే మళ్ళీ అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయారాయన. అల్లోపతి, హోమియోపతి, ఆయుర్వేదం, యునానీ డాక్టర్లు వచ్చి ఆయన్ని పరీక్షిస్తూనే ఉన్నారు.

వాళ్ళందరి లెక్క ప్రకారం ఆయన రెండు రోజుల క్రితమే చనిపోవలసింది. కానీ,

మృత్యువు ఆయన్ని కౌగిలించుకోలేదు. మృత్యువు కూడా ఈ సింహాన్ని చూసి భయపడుతోందా?

కోరికలున్న వారి ప్రాణం ఇలా కొట్టుమిట్టాడుతుంటుందని ఎవరో అన్నారు. కానీ, నాకు తెలిసినంతవరకు ఆయనకు తీరని కోరికలంటూ ఏమీ లేవు. ఆ మాటకొస్తే ఆయన రిటైరయిన దగ్గరనుంచి ప్రయత్నపూర్వకంగా కోరికల్ని తగ్గించుకొంటూ వస్తున్నారు.

''నాయనా, ఇక్బాల్. హిందూ మతంలో 'నాలుగు ఆశ్రమ ధర్మాలను' ప్రతి ఒక్కరూ ఆచరించాలని పేర్కొన్నారు. బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, గృహస్థాశ్రమం అందరూ ఆచరించేవే. కానీ, వనప్రస్థం లేక వానప్రస్థం అన్న ఆశ్రమాన్ని హిందువులు కూడా విస్మరించారు. ఆ ఆశ్రమంలో మనిషి కోరికలను, కుటుంబ బంధాలను ఇచ్ఛాపూర్వకంగా తెంచుకోవాలి. అలా అందరూ చేసినప్పుడు వృద్ధాప్యపు బాధలుండవు. కుటుంబ కలహాలుండవు. సమాజం ఆరోగ్యంగా ఉంటుంది.''

అలాంటి నాన్నగారికి కోరిక లేముంటాయి?

''పగ తీరకపోయినా ప్రాణం ఇలాగే కొట్టుకులాడుతుంటుందోయ్.''

ఎవరో అన్న మాటలకు ఉలిక్కిపడ్డాను నేను.

నాన్నగారికి పగ? ఎవరిమీద?

ఆయన చేసింది పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగమే కావచ్చు. కానీ, ఆయన ఎవర్నీ శత్రువులుగా భావించలేదే?

నా మనసు వెనక్కి.... వెనక్కి.... వెనక్కి... పోయింది.

★——★——★

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లో -

అప్పట్లో నాన్నగారు కృష్ణాజిల్లాలో పని చేస్తుండేవారు.

హైదరాబాద్ నిజాంకు వ్యతిరేకంగా పోలీస్ ఏక్షన్ జరిపే ముందు కృష్ణా జిల్లాలో ఉన్న ముస్లిం పోలీస్ ఆఫీసర్స్‌లో చాలామందిని దూరంగా బదలీ చేసేరు. నాన్నగారిని సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నర్సీపట్నం బదలీ చేసేరు.

''ప్రభుత్వాలకి అనుమానాలు జాస్తిగా ఉంటాయి. అందుకే భారతీయు లందరినీ భారతీయులుగా చూడలేకపోతుంటాయి. హైదరాబాద్ నవాబు ముస్లిం కనుక అతనికి సహాయమంద చేస్తామేమోనని భయం, అనుమానం. ఇది చాలా తప్పుడు ధోరణి. భారతీయులనందరినీ భారతీయులుగా ప్రభుత్వమే చూడలేకపోతే ఎలా?'' నాన్నగారు అమ్మతో చెప్పి బాధపడడం నేను స్వయంగా చూచాను. ఆయన మాటలు ఇప్పటికీ నా చెవుల్లో ప్రతిధ్వనిస్తుంటాయి.

ఆ రోజుల్లో అక్కడ కోడి పందేలు, పొట్టేళ్ళ పందేలు పెద్దయెత్తున జరిగేవి. పెద్ద పెద్ద మొత్తాలలో పాటలు, పాడేవారు. ఈ పోటీలు, పందేలు మూలకంగా ఊళ్ళకి ఊళ్ళు చీలిపోయేవి. రెండు పక్షాల మధ్య తరచు గొడవలు జరుగుతుండేవి.

సుబ్బరాజుగారు పందేల బరిలో నిలిస్తే తిరుగు ఉండదు.

ఆ రోజు జరుగుతున్న అతి పెద్ద పందెంలో సుబ్బరాజుగారున్నారు. ఆయన్ని ఎలాగైనా ఓడించాలని ప్రత్యర్థులు గట్టి పట్టుదలతో ఉన్నారు. సుబ్బరాజుగారు ఆ రోజు గెలిచినా గొడవ జరుగుతుంది. ఓడినా పెద్ద గొడవే జరుగుతుంది.

అలాంటి స్థితిలో నాన్నగారు పోలీస్ బలగంతో అక్కడికెళ్ళి రెండు పక్షాల వారిని అరెస్టు చేసి తీసుకొచ్చారు.

''సుబ్బరాజుగారు ఈ ప్రాంతంలో చాలా పలుకుబడి కలిగిన మనిషి సార్. ఆయన్ని అరెస్టు చేస్తే మనకు ప్రమాదం.'' బయలుదేరే ముందే పోలీసులు ఆయన్ని హెచ్చరించారు.

ఆయినా, నాన్నగారు సుబ్బరాజుగారిని అరెస్టుచేయటమే కాదు. అందరితో పాటు అతడిని ఒకే గదిలో ఉంచారు. అసలు సుబ్బరాజుగారు అన్న వ్యక్తి ఎవరో తెలుసుకొనే ప్రయత్నమే చెయ్యలేదు.

ఈ వార్త ఆ ప్రాంతంలో లావాలా పాకిపోయింది. రెండు పక్షాలు ఏకమై నాన్నగారి పని పట్టాలని నిర్ణయించాయి. తెల్లారితే ఏం జరుగుతుందోనని అంతా భయపడసాగేరు.

నాన్నగారు మాత్రం ఆ రాత్రి నిశ్చింతగా నిద్ర పోయారు.

తెల్లవారేక ఆయన మామూలుగానే అన్ని పనులు నిర్వహించుకొన్నారు. నమాజ్ పూర్తి చేసేరు. అప్పుడు సెంట్రీ వచ్చి చెప్పేడు.

''రామచంద్రరాజుగారు తమర్ని కలువటానికి మేళతాళాలతో చాలా అట్టహాసంగా ఊరేగింపుగా వస్తున్నారు సార్. తన మనుష్యుల ద్వారా ఆయనగారు మీకు కబురు చేసేరు.''

''ఎవరా రామచంద్రరాజుగారు ?''

''ఈ ప్రాంతానికి జమీందారుగారండీ. ప్రస్తుతం రాజకీయాల్లో ప్రముఖుడు. మద్రాసులోని ఆంధ్ర రాజకీయవేత్తల్లో చాలా ప్రఖ్యాతుడు. ఒకసారి మినిష్టరుగా కూడా పని చేసేరు.''

'సరే ఆయన వస్తే ఒక్కడినే లోపలికి అనుమతించు. హాల్లో కూర్చోపెట్టి నాకు చెప్పు''.

మా ఇంట్లోని అందరం నాన్నగారికి తెలియ కుండా రహస్యంగా కిటికీల గుండా ఆ దృశ్యాన్ని చూశాము.

జమీందారుగారు ఏనుగు అంబారీ మీద ఊరేగుతూ వచ్చారు.

ఏనుగు ముందు వరుసల్లో బ్యాండుమేళం వాళ్ళు రంగుల దుస్తుల్లో మెరిసిపోతున్నారు. వారి వెనుక వరుసలో ఆ ప్రాంతంలో మెడ మీద తలకాయ ఉన్నరాజకీయవేత్తలంతా బారులు తీరి ఉన్నాయి. వారి వెనుక లారీలు ఉన్నాయి. వాటి వెనుక బండ్లు ఉన్నాయి. వాటి వెనుక కొన్ని మైళ్ళ దూరం మేరకు రెండు వరుసల్లో జనం ఉన్నారు.

జమీందారుగారు హుందాగా అంబారీ దిగేరు. పట్టువస్త్రాలతో, తలపాగాతో మెరిసి పోతున్నారాయన.

ఎవరో ఆయనకు ఒక పళ్ళేన్ని అందించారు. అది బంగారు పళ్ళెం. బాలభానుడి పసిడి కిరణాలు ఆ పళ్ళెం మీద పడ్తుండడం వల్ల ఆ పళ్ళెం మరింత దేదీప్యమానంగా వెలిగిపోతున్నది. ఆ పళ్ళెం పైన ఒక ముఖమల్ వస్త్రం ఉంది. అందులో పళ్ళెం నిండుగా బంగారు నాణేలున్నాయి.

కానీ, సెంట్రీ జమీందారుగారి నౌక్కరినే లోపలికి అనుమతించాడు. మిగతా వారు గేటు బయటే నిలబడిపోయారు.

సెంట్రీ ఆహ్వానించినా జమీందారుగారు మా ఇంటిలోకి అడుగు పెట్టలేదు. బయటనే నిలబడ్డారు.

కాస్సేపటికి నాన్నగారు ఫుల్ యూనిఫామ్‌లో బయటికొచ్చారు.

''మీలాంటి గొప్పవారు మా ఇంటికి రావడం మా అదృష్టం. అంతటి అదృష్టానికి నేను నోచుకోటానికి కారణమేమిటో నాకు తెలియదు. వ్యక్తిగతమయిన విషయమైతే సవినయంగా మిమ్మల్ని లోపలికి ఆహ్వానిస్తున్నాను. నా ఉద్యోగ ధర్మ నిర్వహణకు సంబంధించిన విషయమయితే.........''

''మా సుబ్బరాజును అరెస్టు చేసిన పోలీస్ ఆఫీసర్‌ను ఒక్కసారి దర్శించి పోదామని వచ్చాను. పెద్దవారి వద్దకు వచ్చేటప్పుడు..... మా లాంఛనాలు మాకుంటాయి కదా? ఈ బరువును మా చేతుల్లో నుంచి దించండి ముందు''.

''నేనిప్పుడు పోలీస్ స్టేషన్‌కు వెళ్తున్నాను. అక్కడికొచ్చి మాట్లాడాల్సిందేమన్నా ఉండే మాట్లాడండి.''

''అలాగే చేద్దాం...... కానీ, ముందుగా ఈ బరువు''

''షటప్'' నాన్న ప్రళయకాల రుద్రుడిలా అరిచారు.

ఆ అరుపుతోపాటు కాలితో బంగారు పళ్ళేన్ని ఒక్క తన్ను తన్నేరు. అది కొన్ని గజాల ఎత్తుకు ఎగిరింది. తళతళమని నవ్వుతూ కింద పడింది. అందులోని నాణేలు నిజాయితీని చూచి భయపడి కాబోలు చెల్లాచెదురుగా పడ్డాయి.

అంతా దిగ్భ్రమ చెంది కళ్ళు అప్పగించి చూస్తుండగానే నాన్నగారు సైకిలెక్కి జనంలో నుంచి స్టేషన్ వైపు దూసుకుపోయారు.

తెప్పరిల్లిన నాయకులు, జనం, నాన్నకు వ్యతిరేకంగా నినాదాలు చేసేరు. గేటు తీసుకొని దౌర్జన్యంగా లోపలికి రాబోయారు.

కానీ, జమీందారుగారు ఒక్క భంగిమతో ఆ జనప్రవాహాన్ని వారించారు.

క్షణంలో ఎవరి దోవన వాళ్ళు వెళ్ళిపోయారు.

జమీందారుగారు కారు ఎక్కి వెళ్ళిపోయారు.

నాన్నగారి కేమవుతుందోనని మేము భయపడ్డాము.

కానీ, ఆయనకేం కాలేదు. పైగా, సుబ్బరాజుగారికి జైలుశిక్ష పడింది.

''నాన్నగారూ, మీ కారోజు అంత ధైర్యం ఎలా వచ్చింది?'' నేను ఉద్యోగంలో చేరేక, నాన్నగారు రిటైరయ్యాక ఒకసారి అడిగేను.

''ధైర్యమా? ఎందుకు? తప్పు చేయటానికి ధైర్యం కావాలి. నేను నా ధర్మాన్ని నిర్వహించాను. నిజాయితీగా వ్యవహారించాను. అందుకు కావాల్సింది కర్తవ్య నిష్ఠకాని, ధైర్యం కాదు. బేటా. ఒక్క విషయం చెప్పనా? డబ్బును నమ్ముకొన్న వారు ఎప్పుడూ పిరికివారుగా ఉంటారు. భగవంతుడిని విశ్వసించిన వారికి పిరికితనం భయపడి తల వంచుతుంది.''

''కానీ, మిమ్మల్ని బదలీ చేసేరు కదా?''

''చెయ్యనీ. ఎక్కడయితేనేం? ఆశలు పెంచుకొన్నావారే బదిలీలకు భయపడ్తారు. నాకు ఉద్యోగం ముఖ్యం. ఊరు కాదు?''

నాన్నగారికి ప్రమోషన్ రావాల్సిన సమయానికి రామచంద్రరాజుగారు మంత్రి అయ్యారు.

నాన్నగారితోపాటు మరో నలుగురు సీనియర్స్‌ని కూడా తోసేసి ఎవరికో ప్రమోషన్ ఇచ్చారు.

'కోర్టుకు పోదాం' అన్నారు ఆ నలుగురూ. వాళ్ళు నలుగురూ నాన్నగారి కన్నా జూనియర్స్.

నవ్వి ఊరుకొన్నారు నాన్నగారు.

నలుగురూ కోర్టులో రిట్ వేసేరు. కాని నాన్న గారు వెళ్లి ఐ.జి. ఆఫ్ పోలీస్‌ను కలిసేరు.

ఐ.జీగారి పేరు అబ్దుల్ ఖాదర్. ఆయన నాన్నగారిని చూడగానే కోపంతో విరుచుకుపడ్డారు.

''పోలీస్ ఆఫీసర్స్ అంటే డిక్టేటర్స్ కాదు. ప్రజల రక్షకులు. మనం జీవిస్తున్నది ప్రజాస్వామ్యంలో. ప్రజానాయకులకన్నా పోలీస్ ఆఫీసర్స్ ఎక్కువా? ఎందుకట నీకంత పొగరు? కాకీ బట్టలు వేసుకోగానే నువ్వో పరగణాకు రాజాననుకొంటున్నావా? ఎందుకయ్యా నీ సీనియారిటీ? తగలెయ్యనా? నీలాంటి వాళ్ళు ప్రజాస్వామ్యంలో పోలీస్ ఆఫీసర్స్‌గా పనికిరారు. నిన్ను ఉద్యోగంలో నుంచి తీసెయ్యనందుకు సంతోషించు. పో. మీరు ఎన్ని కోర్టులు తిరిగినా నేను సర్వీసులో ఉన్నంతకాలం మీకు ప్రమోషన్ రాదు. గెట్ ఎవే''.

''హజ్‌బెనుల్లా హో ఒనే ముల్ వకీల్. గఫూరుర్ రహీం (కృపామయుడు) అల్లా మిమ్మల్ని ఆశీర్వదించుగాక. ఖుదా హఫీజ్ (గుడ్ బై).''

★——★——★

ఖాదర్‌గారు అన్న మాటను నిలబెట్టుకొన్నారు. ఆయన సర్వీసులో ఉన్నంతకాలం కోర్టులో కేసు నానుతూనే ఉంది.

ఆయనకు రిటైరయ్యాక కూడా ప్రభుత్వం ఏదో పెద్ద ఉద్యోగం ఇచ్చింది - ఆయన సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకొని.

"నిజాయితీ అనుక్షణం ఓడిపోతున్నది. అవినీతి, అన్యాయం విజయ కిరీటాలను సంపాదిస్తున్నాయి. ఎన్నాళ్ళిలా? పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోనే ఇలా జరిగితే ప్రజలకి రక్షణ ఎక్కడ?"

రిటైరయ్యాక కూడా నాన్నగారి బాధ ఇదే.

ఇలా ఉండగా, ఒకరోజు నాన్నగారికి ప్రమోషన్ ఇస్తూ ఆర్డర్స్ వచ్చాయి. అప్పటికి ఆయన రిటైర్ అయి చాలాకాలం అయింది. కోర్టులో ఆ నలుగురూ వేసిన రిట్‌ను గురించి మర్చే పోయారు. అందులో ఇద్దరు మరణించారు కూడా.

తర్వాత కొంతకాలానికి ఎరియర్స్ కూడా ఇచ్చారు.

"ఇది న్యాయానికి విజయం కాదా, నాన్నగారూ? వ్యవస్థలో ఎవరో కొందరు వ్యక్తులు దుర్మార్గులు ఉండవచ్చు. కానీ, అందరూ అబ్దుల్ ఖాదర్‌లు, రామచంద్రరాజులు అనుకొంటే ఎలా?"

నాన్నగారు చిరునవ్వు నవ్వేరుకానీ, నాతో చర్చించలేదు

రామచంద్రరాజుగారు మరణించినప్పుడు పత్రికలన్నీ ఆయన్ని పొగుడుతూ వ్యాసాలు రాసేయి. ఫోటోలు ప్రచురించాయి.

"చచ్చినవాడి కళ్ళు చేరెడు అని ఇందుకే అన్నారు, నాన్నగారూ. రామచంద్రరాజుగారిని గురించి ఏం రాసేరో చదవండి."

నాన్నగారు చదివేరు. కానీ ఏమీ కామెంట్ చేయలేదు.

'హజ్ బెనుల్లా హో ఒనే ముల్ వకీల్.

నాన్నగారు ఎటువంటి కష్టాలలో ఉన్నా అనే మాట అది. ఆ మాట ఆయనకు తారకనామం వంటిది. కష్టాలను ఎదుర్కోటానికి ఆయనకు ఉపయోగపడిన కవచం. దాని అర్థం నాకు తెలియదు.

అలాంటి నాన్నగారి మనసులోపగా? ఎవరి మీద?

ఉంటే ఖాదర్‌గారి మీద ఉండవచ్చునేమో?

ఎందుకంటే, ఖాదర్‌గారితో జరిగిన సన్నివేశాన్ని ఆయన అప్పుడప్పుడు తలుచుకొని బాధపడేవారు.

★—★—★

మరో రెండు రోజులు గడిచాయి. నాన్నగారి స్థితిలో మార్పులేదు. ఆయన అభిలాషకు వ్యతిరేకంగా ఆయన్ని మళ్ళీ స్టార్ హాస్పిటల్‌లో చేర్చాలన్న నిర్ణయానికి వచ్చాను.

సరిగ్గా ఆ రోజు—

అబ్దుల్ ఖాదర్ ఫ్యామిలీతో సహా ప్రయాణం చేస్తున్నకారు ఏక్సిడెంట్‌కి గురి అయిందని, ఖాదర్‌తో సహా కారులోని అందరూ చనిపోయారని వార్త వచ్చింది.

'హుర్రే!' ఆనందంతో నాకు తెలీయకుండానే అరిచాను, వార్త వినగానే. రేడియోలో

వార్తలను రికార్డు చేసేను. పత్రికల్లో వార్తలని, ఖాదర్ శవం బొమ్మల్ని కట్ చేసేను.

''నాన్నగారూ, ఓ గుడ్ న్యూస్, అబ్దుల్ ఖాదర్ చేసిన పాపాలు పండేయి. ఫ్యామిలీతో సహా ఒక ఏక్సిడెంట్‌లో చచ్చాడు. ఈ వార్తలు వినండి. ఈ బొమ్మలు చూడండి, నాన్నగారూ''.

అలా అరచి అరచి, ప్రయత్నించగా ప్రయత్నించగా నాన్నగారు ఎప్పటికో మెల్లగా కళ్ళు తెరిచారు.

దాంతో నాకు నాన్నగారు బతుకుతారన్న ఆశ కలిగింది.

ఉత్సాహంగా ఖాదర్ ఎలాంటి దారుణ పరిస్థితుల్లో చనిపోయింది వివరించే రేడియో వార్తలని వినిపించాను. పత్రికల్లో వార్తలను చూపేను. ఏక్సిడెంట్ వల్ల వికృతమైన ఖాదర్ శవం బొమ్మల్ని చూపించాను.

నాన్నగారు కళ్ళు మూసుకొన్నారు - నిశ్శబ్దంగా!

ఆయన కళ్ళ వెంట నీరు కారసాగేయి.

''నాన్నగారూ, క్షమించండి. మిమ్మల్ని కష్ట పెట్టాలని నేను ఆ వార్త చెప్పలేదు. మీరు బతుకుతారన్న ఆశతో....''

నాన్నగారు తల అడ్డంగా ఊపేరు. నన్ను గుండెలకు దగ్గరగా రమ్మని సౌంజ్ఞచేసేరు.

''భారతీయులం మనం. శత్రువును సైతం ప్రేమించే సంస్కృతికి వారసులం. ద్వేషించవద్దు. మానవత్వాన్ని కోల్పోవద్దు.'' నా చెవిలో మెల్లగా అన్నారు.

ఆ క్షణంలో నేనెంత అల్పుడినో తెలుసుకొన్నాను.

ఆయన సుఖదుఃఖాలను అతీతుడైన మహర్షి. ఆయనకు పగా?

''నాన్నగారూ, నన్ను క్షమించండి?''

కానీ, ఆయనిప్పుడు క్షమించటానికి, శిక్షించటానిక్కూడా అతీతమైన స్థితికి వెళ్ళేరు.

ఇండియాటుడే — అక్టోబర్ 21 - నవంబర్ 5, 1993